సాక్షి
నారాయణపేట
ఆదివారం, 12, మే, 2024



పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ తెలిపారు.

వివరాలు 3లో ▸



కాంగ్రెస్‌తోనే సంక్షేమం

'తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే నెరవేరుస్తూ మన్ననలు అందుకుంటోంది.' అని కాంగ్రెస్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య బీమా, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్, రూ.500కే సిలిండర్ సరఫరా పథకాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నాం. అయితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఎమ్మెల్సీ, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల కోడ్ కారణంగా ఉచిత కరెంట్, రూ.500కే సిలిండర్ వంటి వాటికి బ్రేక్‌పడింది. కోడ్ ముగియగానే వాటిని అమలు చేస్తాం. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ సైతం ఆగస్టు 15లోపు చేస్తాం. ఇందులో ఎలాంటి అనుమానాలు లేవు' అని పేర్కొన్నారు. 'ఇచ్చిన హామీలను అమలు కావడం లేదని ప్రతిపక్షాలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయి.. ఈ ఎన్నికలు పాలమూరు భవిష్యత్‌కు సంబంధించినవి.. గెలిస్తే పాలమూరుకు, ఢిల్లీకి వారధిగా ఉంటూ మహబూబ్‌నగర్ సమగ్రాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తా' అని ఉద్ఘాటించారు. శనివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వంశీచంద్‌రెడ్డి ఏమన్నారో ఆయన మాటల్లోనే..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

పాలమూరు సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- పీఆర్‌ఎల్‌ఐకి జాతీయ హోదా నా మొదటి ప్రయార్టీ
- రెండేళ్లలో మక్తల్–నారాయణపేట–కొడంగల్ ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం
- పెండింగ్ ప్రాజెక్ట్‌లు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తాం
- పదేళ్లు బీఆర్‌ఎస్, బీజేపీ అధికారంలో ఉన్నా.. మహబూబ్‌నగర్‌ను పట్టించుకోలేదు..
- వారికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు..
- 'సాక్షి'తో కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి

నియోజకవర్గానికో హబ్..

ఎస్సీ వర్గీకరణతోపాటు ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏకి మార్చేలా, మాదాసి కుర్వలను ఎస్టీ జాబితాలో చేర్చేలా నా వంతు ప్రయత్నం పకడ్బందీగా చేస్తా. మన్యం కొండ, కురుమూర్తి తదితర ఆలయాలకు అధిక మొత్తంలో నిధులు సమకూరేలా అందరి సహకారంతో ముందుకు సాగుతా. వికారాబాద్–కృష్ణా రైల్వే లైన్‌కు సర్వే ఇప్పటికే మొదలైంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్రస్థాయి అధికారులతో మాట్లాడారు. దీన్ని పూర్తి చేయడంతో పాటు షాద్‌నగర్ వరకు ఎంఎంటీఎస్ సేవలు విస్తరించేలా పాటు పడతా. సైనిక్ పాఠశాల ఏర్పాటు, గోకుల్ ప్రాజెక్ట్‌కు నిధులు మంజూరయ్యేలా చూస్తా. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్, ఐటీ హబ్‌గా, జడ్చర్లను ఇండస్ట్రియల్ హబ్‌గా, దేవరకద్రను ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా, నారాయణపేటను టెక్స్‌టైల్ హబ్‌గా, మక్తల్‌ను టూరిజం హబ్‌గా, షాద్‌నగర్‌ను లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతా. జూరాల, కోయిల్‌సాగర్, సంగంబండ, చంద్రఘడ్ పోర్టును పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా.

అహంకారానికి, ఆత్మగౌరవానికి మధ్య పోరు..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికలు బంగ్లా అహంకారానికి, పాలమూరు ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్నవి. ప్రజలు నిశితంగా గమనించాలి. ప్రతిఒక్కరూ ఆలోచించి ఓటేయాలి. కేసీఆర్ సీఎం అయిన తర్వాత ఆయన ఇలాకా ఎలా అభివృద్ధి చెందిందో చూడండి. ఇప్పుడు మన పాలమూరు బిడ్డ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయనకు ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో బలం పెరిగేలా చూడాలి. నేను గెలిస్తే అటు రాష్ట్రానికి, కేంద్రానికి ఇటు ఉమ్మడి పాలమూరుకు వారధిగా ఉంటా. పాలమూరుకు నిధుల వరద పారితే అన్ని రకాలుగా జిల్లాను అభివృద్ధి చేసుకోవచ్చు. ప్రజలు ఎలాంటి తప్పు జరగకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా.

బీఆర్‌ఎస్‌తో కుమ్మక్కు..

రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీ పదేళ్లు అధికారంలో ఉన్నా.. మహబూబ్‌నగర్‌ను పట్టించుకోలేదు. డీకే అరుణ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. అయినా పాలమూరు ప్రాజెక్టుకు జాతీయహోదా తేలేదు. అదనంగా ఒక్క పైసా తీసుకురాలేదు. అంతకు ముందు ఆమె ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా పని చేశారు. ఆమెకు అభివృద్ధి చేసే అవకాశం వచ్చినా.. చేయలేదు. పైగా తానే అన్ని చేసినట్లు ప్రగల్భాలు పలుకుతున్నారు. పాలమూరుకు ఆమె ఏం చేశారో ప్రజలకు తెలుసు. ఇప్పుడు కూడా ఆమె కుమ్మక్కు రాజకీయాలకు తెరలేపారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే. బీఆర్‌ఎస్ గెలిచేది లేదు అని ఆ పార్టీ వాళ్లతో కుమ్మక్కై కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని చూస్తున్నారు.

పూర్తిస్థాయిలో వలసల నివారణకు కృషి..

నేను గెలిస్తే నా మొదటి ప్రాధాన్యత పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టే. కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఈ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా తీసుకొస్తా. దీంతోపాటు రెండేళ్లలో మక్తల్–నారాయణపేట–కొడంగల్ ప్రాజెక్ట్ పూర్తి చేసేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతా. పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు నీరందించేందుకు పాటుపడుతా. నిరుద్యోగ శాతం ఇక్కడే ఎక్కువగా ఉంది. ఈ మేరకు తగిన పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తా. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి.. పూర్తిస్థాయిలో వలసలు నివారించేలా తగిన చర్యలు తీసుకుంటా.

2 లక్షల మెజార్టీతో గెలుస్తా..


నా విజయంపై ఎలాంటి అనుమానాలు లేవు. మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మా పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. వారితో సమన్వయం చేసుకుంటూ ప్రతి మండలం, గ్రామం, పట్టణాల్లో విస్తృత ప్రచారం చేశా. ప్రతి చోట ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సుమారు రెండు లక్షల మెజార్టీతో గెలుస్తాననే నమ్మకం ఉంది.

కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుంది

- బీజేపీ గెలుపుతోనే పాలమూరు రూపురేఖలు మారుతాయి
- తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

– పాలమూరు

– వివరాలు 2లో..



కాంగ్రెస్‌వి అబద్ధపు హామీలు..

- అది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వ్యతిరేక పార్టీ
- బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం
- నాగర్‌కర్నూల్‌లో భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలి..
- వనపర్తి జనసభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు మద్దతుగా వనపర్తిలోని పాలిటెక్నిక్ క్రీడామైదానంలో శనివారం నిర్వహించిన జనసభలో ఆయన మాట్లాడారు. మైసిగండి, ఉమామహేశ్వరం, జోగుళాంబ అమ్మవారిని నమస్కరిస్తూ ప్రసంగాన్ని మొదలుపెట్టారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేకపోతోందని విమర్శించారు. రైతుకు ఏడాదికి రూ.15 వేలు, కౌలు రైతు కు రూ.12 వేలు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని.. ఇవి అమలుకు నోచుకోలేదన్నారు. ప్రతి రైతుకు క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్, విద్యార్థులకు రూ.5 లక్షల రుణం, కళాశాలకు వెళ్లే ప్రతి బాలికకు స్కూటీ ఇస్తామన్న హామీలను నెరవేర్చలేదన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీలో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వ్యతిరేక పార్టీ అని విమర్శించారు.



కేంద్ర నిధులతోనే అనేక అభివృద్ధి పనులు..
నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో కేంద్ర నిధులతోనే అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు అమిత్‌షా వెల్లడించారు. రూ.820 కోట్లతో కల్వకుర్తి–నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ మీదుగా నంద్యాల వరకు జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రూ.1,100 కోట్లతో సోమశిల వద్ద కృష్ణానదిపై కేబుల్ ఐకాన్ బ్రిడ్జిని నిర్మిస్తున్నామన్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని.. భద్రాచలం, అలంపూర్ జోగులాంబ, రామప్ప దేవాలయాలకు ప్రసాద్ స్కీం ద్వారా నిధులు కేటాయించామని చెప్పారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 2.15 లక్షల మందికి ఆయుష్మాన్ భారత్ కింద రూ.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ అందించినట్లు వెల్లడించారు. 33 వేల మంది మహిళలకు సిలిండర్‌లను ఉచితంగా పంపిణీ చేశామని, రెండు లక్షల మంది రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి అందజేస్తున్నట్లు వివరించారు. బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు ఓటు వేస్తే అవి నేరుగా మోదీకి వెళ్తాయన్నారు.



ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు

- ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం
- అయిజ, గద్వాల, వనపర్తి రోడ్‌షోలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

– వివరాలు 2లో..

అంతా.. గప్‌చుప్!



- ముగిసిన లోక్‌సభ ఎన్నికల ప్రచారపర్వం
- మూగబోయిన మైక్‌లు
- జాతీయ, రాష్ట్ర నాయకుల రోడ్‌షోలు, సభలు పూర్తి
- పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రధాన పార్టీల నజర్
- రేపు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్

– వివరాలు 2లో..

ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు




గద్వాల రోడ్‌షోలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, అయిజలో ప్రజలకు అభివాదం చేస్తూ..

- ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం
- పదేళ్లలో బీఆర్‌ఎస్ దోచుకోవడం, దాచుకోవడం తప్పా ప్రజలకు చేసిందేమీ లేదు
- మల్లు రవిని గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

వనపర్తి/ గద్వాల/ అలంపూర్/ అయిజ: రానున్న ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు ఇస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా అయిజ, గద్వాల, పెబ్బేరులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ అభివృద్ధి పేరిట దోచుకోవడం, దాచుకోవడం మాత్రమే చేసిందని ఎద్దేవా చేశారు. వైఎస్‌ఆర్ హయాంలోనే ఈ ప్రాంతానికి సాగునీరు వచ్చిందని, అతి త్వరలో పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలను పూర్తి చేసి సాగునీటి లభ్యతను పెంచుతామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది ప్రజల కోసమేనని, వారి అవసరాల మేరకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు మనలాంటి పేద ప్రజల కోసమేనన్నారు. నాగరకర్నూల్ పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్నారు. ఇక్కడి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వ్యక్తి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. విద్యావేత్తగా దళితుల కోసం బీఎస్పీ పార్టీకి పని చేస్తానని చెప్పి.. ఇప్పుడు బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నాడని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ కుట్రలు చేస్తే ప్రజలు గ్రహించి ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారన్నారు. అలంపూర్ పరువు తీసిన ఈ వ్యక్తికి ఒక్క ఓటు వేసినా.. మనకు మనమే అన్యాయం చేసుకున్నట్లు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపిస్తే.. అయిజలో డిగ్రీ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు.

మెజార్టీ రాకుండా కుట్ర..

ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గ ప్రజలకు అభయం ఇచ్చేందుకే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వచ్చారన్నారు. అలంపూర్‌లో అభివృద్ధి పనులకు ఎన్ని కోట్లు ఖర్చయినా పంపిస్తారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గతంలో కేసీఆర్ ఫాంహౌస్‌ను కూలగొట్టాలని అన్నాడని, ఇప్పుడు అదే ఫాంహౌస్‌లో దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపిస్తే ప్రజారాజ్యం పోయి.. పోలీస్ రాజ్యం వస్తుందని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు రాజకీయ అనుభవం లేదని ఎద్దేవా చేశారు. ఎంపీ అభ్యర్థి మల్లు రవి మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపిస్తే అలంపూర్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానన్నారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, సినీ నిర్మాత బండ్ల గణేష్, బీఎస్ కేశవ్, పద్మ, నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, బండారి భాస్కర్ పాల్గొన్నారు.

అంతా.. గప్‌చుప్!

- ముగిసిన లోక్‌సభ ఎన్నికల ప్రచారపర్వం
- మూగబోయిన మైక్‌లు
- జాతీయ, రాష్ట్ర నాయకుల రోడ్‌షోలు, సభలు పూర్తి
- పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రధాన పార్టీల నజర్
- రేపు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్



సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల ప్రచారపర్వం ముగిసింది. శనివారం సాయంత్రం 6 గంటల తర్వాత అన్ని పార్టీలు, అభ్యర్థుల ప్రచార రథాలు, మైక్‌లు ఒక్కసారిగా మూగబోయాయి. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల్లో ఈనెల 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు లోక్‌సభ ఎన్నికలను నిర్వహించనున్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందునుంచే అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముగించడంతో లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వానికి తెరపడింది. మిగిలిన సమయంలో పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. అయితే శనివారం రాత్రి నుంచే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సిద్ధమయినట్టు తెలుస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధి విస్తృతంగా ఉండటం, పెద్ద సంఖ్యలో ఉన్న ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ఖర్చు భారీగా ఉండనుండటంతో ప్రధానంగా సామాజికవర్గాల వారీగా ఓట్లను గంపగుత్తగా పొందేందుకు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

అగ్ర నేతలతో పార్టీల ప్రచారం..

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందు నుంచే ప్రధాన పార్టీలు తమ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. షెడ్యూల్ విడుదలకు ఒక రోజు ముందుగానే ప్రధాని నరేంద్రమోదీ నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొని పార్టీశ్రేణుల్లో ఉత్సాహం నింపారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థులు డీకే అరుణ, భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా నాగర్‌కర్నూల్, తాజాగా నారాయణపేట జిల్లాకేంద్రాల్లో ఆయన పర్యటించారు. కేంద్రమంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డి, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రపటేల్, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై తదితర నేతలు పాల్గొని ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో తొమ్మిది పర్యాయాలు పర్యటించి వంశీచంద్‌రెడ్డి, మల్లురవి తరఫున విస్తృత ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభలతో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని విస్తృత చేశారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో రెండు రోజుల పాటు పర్యటించారు. బస్సుయాత్ర ద్వారా ఉమ్మడి జిల్లాలో పర్యటించిన కేసీఆర్ మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రాల్లో ఆపార్టీ అభ్యర్థులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా రోడ్‌షోల్లో పాల్గొన్నారు. స్థానిక నేతలు, ప్రజలతో మమేకం అవుతూ గులాబీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి, అచ్చంపేట, గద్వాల నియోజకవర్గకేంద్రాల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో పాల్గొని పార్టీ తరఫున ప్రచారం నిర్వహించారు.

144 సెక్షన్ అమలు..

శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఎన్నికల ప్రచారం గడువు ముగియడంతో ఎన్నికల నిబంధనల ప్రకారం 144 సెక్షన్ అమలులోకి వచ్చింది. జూన్ 1న సాయంత్రం 6.30 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎన్నికల అధికారులు ప్రకటించారు. పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి ఎలాంటి ప్రచార కార్యక్రమాలకు, సమావేశాలకు అనుమతి లేదు. ఈ నెల 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. సాధారణంగా సాయంత్రం 5 గంటల వరకే పోలింగ్ ఉండగా, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం సాయంత్రం 7 గంటల వరకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. సమయంలోగా పోలింగ్‌బూత్‌కు చేరిన అందరికీ చివరి ఓటరు వరకు ఓటు హక్కును కల్పించనున్నారు.

ప్రచార రథాలు, సామాజిక మాధ్యమాలే కీలకం..

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ప్రచార రథాలు, సామాజిక మాధ్యమాలే లక్ష్యంగా ప్రచారాన్ని నిర్వహించాయి. బడా నేతలతో సభలు, రోడ్‌షోలతో పాటు వినూత్న రీతిలో ఓటర్లను ఆకర్షించేందుకు విశ్వప్రయత్నాలు చేశాయి. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గం 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తృతంగా ఉండటం, సమయం తక్కువగా ఉండటంతో పార్టీల అభ్యర్థులు ప్రచార రథాలు, సామాజిక మాధ్యమాలపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రతి ఓటరును చేరేందుకు ఆయా సంస్థల ద్వారా ఐవీఆర్‌ఎస్ పద్ధతిలో ఓటరు సెల్‌ఫోనుకు నేరుగా కాల్ చేసి తమ సందేశాన్ని విన్పించారు. ఒక్కో ఓటరుకు రోజుకు పదుల సంఖ్యలో ఫోన్లు చేసి ఎన్నికల ప్రచారాన్ని మోత మోగించారు.

ఉమ్మడి జిల్లా ప్రధాన ఫోకస్‌గా మూడు పార్టీలు తమ నేతలతో ప్రచారాన్ని హోరెత్తించాయి.

జనసంద్రమైన పాలిటెక్నిక్ క్రీడా మైదానం



ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను అభినందిస్తున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

- 30 నిమిషాల పాటు అమిత్‌షా ప్రసంగం
- కట్టుదిట్టమైన బందోబస్తు

వనపర్తి: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జన సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం 1.28 గంటలకు హెలీకాప్టర్‌లో వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా 1.38 గంటలకు సభావేదికకు చేరుకున్నారు. భద్రాచలం రామయ్య, జోగుళాంబ అమ్మవారి పేర్లతో తన ప్రసంగాన్ని ప్రారంభించి సుమారు 30 నిమిషాల పాటు కొనసాగించారు. మోదీ మూడోసారి ప్రధాని కావడానికి ఈసారి కమలం గుర్తుకు ఓటేయాలని కోరుతూ.. రెండు చేతులు పైకెత్తి భారత్‌మాతాకి జై అంటూ నినదించాలని కార్యకర్తల్లో జోష్ నింపారు. తన ప్రసంగాన్ని తెలుగులో అనువాదం చేయాలా అని అడిగి అనువాదించాలని పార్టీ నేతలకు సూచించారు.

అనువాదానికి నేతల అవస్థలు..

మంత్రి ప్రసంగాన్ని మొదట పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అనువదించి కాసేపటికే విరమించుకున్నారు. నేతల బలవంతంతో రాష్ట్ర నాయకుడు ఆచారి వచ్చి అనువాదం చేసే క్రమంలో కొన్ని తప్పులు దొర్లాయి. ఈ విషయంపై కేంద్ర మంత్రి జిల్లా పార్టీ నాయకులపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

మోదీ హయాంలోనే ఆర్థికాభివృద్ధి..

దేశ ఆర్థికాభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమైందని జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మరోసారి ప్రధానిని చేస్తే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు భద్రతకు భరోసా ఉంటుందన్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర నాయకుడు ఆచారి మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పడంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఆస్కార్ ఇవ్వొచ్చంటూ వ్యంగాస్త్రాలు విసిరారు. ఖమ్మం నుంచి వలస వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి ఓటు వేయడం సరికాదన్నారు. అధికారం కోసం బహుజన వాదాన్ని అటకెక్కించిన బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా లేరని, బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు ఓటేస్తే.. ప్రధాని మోదీకి వేసినట్లేనని ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో అభ్యర్థి పి.భరత్‌ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ కె.జనార్దన్‌రెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ, గద్వాల జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం, బచ్చు రాము, రామన్‌గౌడ్, పెద్దిరాజు, మధు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన జనం

కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుంది

- బీజేపీ గెలుపుతోనే పాలమూరు రూపురేఖలు మారుతాయి
- డీకే అరుణ గెలుపు ఖాయం.. కేంద్ర మంత్రి కూడా కాబోతుంది
- తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై
- కాషాయమయమైన మహబూబ్‌నగర్



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న అన్నామలై, డీకే అరుణ

పాలమూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోటికి వచ్చినట్లు డీకే అరుణను తిట్టాడు.. అంటే ఈ పాలమూరు ఆడబిడ్డలను అందరినీ తిట్టినట్లే.. ఎంపీ ఎన్నికల్లో ఈ ప్రాంత మహిళలు ఓటుతో బుద్ధి చెప్పాలని బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఏనుగొండ నుంచి క్లాక్‌టవర్ వరకు నిర్వహించిన రోడ్‌షోకు ఆయన హాజరయ్యారు. ఆ తర్వాత క్లాక్‌టవర్ దగ్గర ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో డీకే అరుణ గెలవడంతోపాటు కేంద్ర మంత్రి సైతం కాబోతుందన్నారు. ఓటమి భయంతో కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని, రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేశాడని, ఈసారి ఆ పార్టీ మాటలు నమ్మరాదన్నారు. కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని అందుకే పదే పదే సీఎం ఈ నియోజకవర్గానికి వస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని డబ్బులు ఇచ్చి.. ఎన్ని కుట్రలు చేసినా పాలమూరులో డీకే అరుణ విజయం ఆపలేరన్నారు. ఈ ప్రాంత ప్రజల కోసం, సాగునీటి ప్రాజెక్టుల కోసం 11 రోజుల పాటు పాదయాత్ర చేసిన చరిత్ర ఆమెదన్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడే రేవంత్‌రెడ్డి మొదట ఈ జిల్లా ప్రజల కోసం, ఈ జిల్లాకు ఏం చేశాడో చెప్పాలన్నారు. గత పదేళ్ల కాలంలో మోదీ ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని, 370 ఆర్టికల్, త్రిపుల్ తలాక్ రద్దు, అయోధ్యలో రామ మందిరం నిర్మాణం చేశారన్నారు. ప్రతినిత్యం పాలమూరు ప్రజల కోసం ఆలోచించే డీకే అరుణపై కాంగ్రెస్ నేతలు నీచమైన మాటలు మాట్లాడటం సరికాదన్నారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేసి అరుణమ్మకు మద్దతు తెలపాలని కోరారు. ఈసారి మోదీ అంటున్న చార్‌సౌ పార్‌లో పాలమూరు సీటు పక్కా ఉంటుందన్నారు. చివరలో తెలుగులో మాట్లాడలేకపోతున్నందుకు చాలా బాధగా ఉంది.. మీరంతా పెద్దమనసుతో మన్నించాలని కోరారు. అంతకు ముందు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ మాట్లాడుతూ ఓటమి భయంతోనే సీఎం రేవంత్‌రెడ్డి నన్ను తిడుతున్నాడని, ఆయన మాటలను పాలమూరు ఆడబిడ్డలు గమనించాలన్నారు. ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని ఈ ప్రాంత ప్రజలు మట్టికరిపించాలన్నారు. పాలమూరు ప్రజల గొంతు పార్లమెంట్‌లో వినిపించాలంటే బీజేపీ అభ్యర్థి అయిన తనను గెలిపించాలని, ప్రతి బూత్‌లో 370 ఓట్లు వచ్చేలా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు.



పాలమూరులో బీజేపీ బైక్ ర్యాలీ

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



పెద్దకొత్తపల్లిలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి/వీపనగండ్ల /కోడేరు: పేదల సంక్షేమమే కాంగ్రెస్‌పార్టీ ధ్యేయమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పెద్దకొత్తపల్లి మండలంలోని దేవర్‌తిర్మలాపూర్, పెద్దకొత్తపల్లి, వెనచర్ల, వీపనగండ్ల, కోడేరులో పర్యటించి మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో రాష్ట్ర ఖజానాలోని 80 శాతం నిధులు ఆంధ్ర ప్రాంతానికే వెళ్లేవని.. కాంగ్రెస్‌పార్టీ ప్రత్యేక రాష్ట్రం ఇవ్వడంతో ఇక్కడి వనరులు, నిధులు ఈ ప్రాంత ప్రజలకే దక్కుతున్నాయని తెలిపారు. ఉచిత విద్యుత్ పథకం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సఫలీకృతమైందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని తెలిపారు. రాష్ట్రంతో పాటు దేశంలో కూడా సంక్షేమ పథకాలు అమలవుతాయని చెప్పారు. శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ ఇచ్చి ఎంపీ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలని కోరారు. పెద్దకొత్తపల్లి మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, వీపనగండ్లలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, మండల అధ్యక్షుడు బీరయ్యాయాదవ్, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, కోడేరులో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు, కో–ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖరీం, చలపతిరావు, జగదీశ్వరావు, ధూరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నగదు పట్టివేత

నర్వ/ నవాబ్‌పేట: నర్వ మండల పరిషత్ వద్ద రహదారిపై ఎస్‌ఎస్‌టీ టీం శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పవన్‌రెడ్డి, శంకర్‌రెడ్డిల వాహనాన్ని తనిఖీ చేశారు. ఇందులో రూ.7 లక్షలు లభించగా విచారణ చేసిన పోలీసులకు, ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ కుర్మయ్య తెలిపారు.

నవాబ్‌పేటలో కలకలం..

నవాబ్‌పేటలో డబ్బుల పట్టివేత కలకలం రేపింది. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శనివారం మండలంలోని యన్మన్‌గండ్ల గేట్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడికి చెందిన వాహనంలో తరలిస్తున్న రూ.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కాగా నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయమై స్థానిక పోలీసులు స్పందిస్తూ ప్రత్యేక బృందాలు తనిఖీ చేపట్టాయని సమాధానం ఇచ్చారు.

'వికసిత్ కాదు.. వికటించిన భారత్‌లా మారింది'



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్

కల్వకుర్తి టౌన్: కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ వికసిత భారత్‌లా తయారైందని చెబుతున్నా.. వాటికి భిన్నంగా వికటించిన భారత్‌లా మారిందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ విమర్శించారు. శనివారం పట్టణంలోని మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ ఇంట్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని సంపదను అంతా దోచి, సంపన్నులకు కట్టబెట్టారన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్న నిత్యావసర, గ్యాస్ ధరలు, ఇతర వాటిపై పన్నులను అధికంగా మోపి నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజలను దోచుకున్నారని దుయ్యబట్టారు. ప్రజాకంటక పాలనను అందించేందుకు మార్పు కోసం ప్రజలందరూ ఇండియా కూటమి వైపు ఉన్నారన్నారు. ప్రజలను మోసం చేయటమే మోదీ గ్యారంటీలుగా పెట్టుకున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ పాంచ్ న్యాయ గ్యారంటీలను ప్రజలు విశ్వసించారని, భారత్ జోడో న్యాయ యాత్ర ద్వారా దేశ సంపదను సమానంగా ప్రజలందరికీ పంచేందుకు రాహుల్‌గాంధీ చేపట్టారని తెలిపారు.

ప్రజలు మార్పు కోరుకున్నారు

రాష్ట్ర ఆవిర్భావం నుంచి అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాహుకాలంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఎలాంటి అభివృద్ధి చేయలేకనే కాంగ్రెస్ గ్యారంటీలను ప్రజలు నమ్మి గెలిపించారని అన్నారు. ప్రజాకంటక పాలనను బొందపెట్టి ప్రజలు మార్పు కోరుకున్నారని తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డా.మల్లురవిని గెలిపిస్తే కల్వకుర్తి ప్రాంతాన్ని జోడెద్దులాగా అభివృద్ధి చేసుకునేందుకు వీలుంటుందని తెలిపారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, ఇందిరా శోభన్, ఆనంద్‌కుమార్, వెంకటేష్, చంద్రకాంత్, సురేందర్‌రెడ్డి, రాజేష్, జహీర్, సత్యం, శశికుమార్ పాల్గొన్నారు.

మత్తులో దించి ఓట్లడుగుతారు జాగ్రత్త

కొల్లాపూర్: ప్రజలను మత్తులో దించి ఓట్లేయించుకునేందుకు అధికార పార్టీ నాయకులు సిద్ధమయ్యారని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. శనివారం సాయంత్రం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తాగించే మంత్రి కొల్లాపూర్‌లోనే ఉన్నారు. బీర్లు, విస్కీలు, 90 ఎంఎల్ సీసాలు గ్రామాల్లో దించేశారు. ప్రజలను మత్తులో దించి ఓట్లు వేయించుకోవాలని అధికార పార్టీ నాయకులు చూస్తున్నారని అన్నారు. 13వ తేదీన ఒకటో నంబర్‌లో ఉన్న కారు గుర్తుపై ఓటేయండని కోరారు. నాకు మద్దతుగా నిలుస్తున్న వారిపై పోలీసుల చేత మంత్రి అక్రమ కేసులు పెట్టిస్తున్నాడు. బెదరకుండా పని చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. 167కే నేషనల్ హైవేలో భాగంగా సోమశిల సమీపంలోని కృష్ణానదిపై నిర్మించబోయే బ్రిడ్జిని ఆపాలని కాంగ్రెస్ నాయకులు చూస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి కష్టపడి జాతీయ రహదారి, వంతెన సాధించారు. దాన్ని ఎవరో ఆపుతామంటే చూస్తూ ఊరుకోం. దాన్ని ఎలా సాధించుకోవాలో మాకు తెలుసన్నారు. మీకు పిల్లల భవిష్యత్ కావాలా బీరు బాటిళ్లు కావాలా? మీ బిడ్డలు కూలీలుగా మారాలా? డాక్టర్లు, ఇంజనీర్లు కావాలా? లేక పారిశుద్ధ్య కార్మికులుగా మిగలాలా, రేకుల షెడ్డుకింద ఉండాలా లేక అమెరికా వెళ్లే స్థాయికి ఎదగాలా అనేది మీరే నిర్ణయించుకోవాలన్నారు. గురుకులాల కార్యదర్శిగా పనిచేసినప్పుడు వాటి బాగుకు కృషిచేశా. గురుకులాల్లో చదివిన వేలాది మంది విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారు. పేదలు కూడా ఉన్నతస్థానాల్లో ఉండాలనేది నా లక్ష్యం. అన్ని వర్గాల సంక్షేమం కోసం కష్టపడి పనిచేస్తా అని చెప్పారు.



కొల్లాపూర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్

రాజ్యాంగాన్ని కాలరాస్తున్న శక్తులను తరుముదాం

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో రాజ్యాంగాన్ని కాలరాస్తున్న శక్తులను తరుముదామని ప్రముఖ సామాజిక విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన రాజ్యాంగాన్ని 'రక్షించుకుందాం–దేశాన్ని కాపాడుకుందాం' పేరిట నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. మణిపూర్‌లో జరిగిన ఘటనలు మనవరకు రాదని అనుకోకూడదని, దేశంలో ఎక్కడైనా జరగొచ్చని అన్నారు. మన దేశం కోసం జరిగిన సుదీర్ఘ స్వాతంత్ర్యం పోరాటంలో ఎలాంటి పాత్రలేని సంస్థలు, పార్టీలు వారు ఈ దేశం అందరిది కాదంటున్నారని అన్నారు. ఈ దేశం అందరిది అనే విలువ అనాధిగా వస్తున్నదని తెలిపారు. ఈ దేశంలో సమాన హోదా, హక్కు, గౌరవంగా జీవనం కొనసాగించే స్వేచ్ఛ కోసం మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. కరోనా సమయంలో ఆస్పత్రులు, బెడ్లు లేవని, మందులు దొరకలేదన్నారు. చాలా మంది చనిపోయారని, వేలాది మంది కార్మికులు కాలిబాటన వెళ్లారని, చప్పట్లు కొట్టమంటే కొట్టాం, దీపాలు వెలిగించామని తెలిపారు. ఒక రోజు రాత్రి నుంచి మన వద్ద ఉన్న నోట్లు చెల్లకుండా పోయాయని, డబ్బుల కోసం బ్యాంకుల వద్ద క్యూలైన్‌లో నిలబడ్డామని ఇవన్నీ మరిచిపోయారా? అని అన్నారు. ఏం జరుగుతుందో మనం ఆలోచించుకోవాలని, గతంలో జరిగిన వాటిని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సారి మనందరం మారాలని, వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. సియాసత్ ఎడిటర్ ఆమేర్‌అలీఖాన్ మాట్లాడుతూ ఈనెల 13న ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా తప్పనిసరిగా ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రవిచంద్ర, రాఘవాచారి తదితరులు ప్రసంగించారు. సదస్సులో ఎస్‌ఎం.ఖలీల్, హనీఫ్ అహ్మద్, సుధాకర్, షేక్ సిరాజ్, షేక్ అబ్దుల్లా, జనజ్వాల, లక్ష్మణ్‌గౌడ్, వల్లభాపురం జనార్దన్, తజముల్, గట్టన్న మౌలానా మొహిసిన్ పాష ఖాద్రీ, కేసీ.వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్